# షణ్ముఖన్

జిలుగు వసనాల మణిమయయోజ్జ్వల మనోజ్ఞ
కాంచ నాంచిత భూషణగణము పూని
రాజవీథుల రతనాల రథము నెక్కి
వెడలు నిర్జీవ పాషాణ విగ్రహంబ !
చిమ్మ చీకటి పొగల నిశీథమందు,
క్షుద్ర మందిరాంతర జీర్ణ కుడ్యతలము
లందు కన్నులు మూసి, యానందవశత,
యోగవిజ్ఞాన మబ్బిన యోజ, నొడలు
మరచి కులుకు దివాంధమా ! మెరుగు లొలుకు
చలువరాతి మేడల చెరసాల లందు,
తళుకు బంగారు సంకెళ్ళు దాల్చి, లోక
పాలకుని బోలె మురియు నో బానిసీడ !
ఓ కుటిల పన్నగమ ! చెవి యొగ్గి వినుడు !
ఏను స్వేచ్ఛా కుమారుడ నేను గగన
పథ విహార విహంగమ పతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూ ప్రభంజన స్వామి నేను !

**నేను - కృష్ణశాస్త్రి**